క్లుప్తంగా

టీడీపీ నుంచి వైఎస్సార్ సీపీలోకి చేరిక



జగ్గయ్యపేటఅర్బన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి రాష్ట్రంలో పార్టీలు, వర్గాలు, కులాలకు అతీతంగా అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులైన పలువురు ప్రతిపక్ష తెలుగుదేశం పార్టీ నాయకులు ఆ పార్టీని వీడి వైఎస్సార్ సీపీలోకి చేరుతున్నారని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను అన్నారు. పట్టణంలో మంగళవారం 28 వ వార్డుకు చెందిన షేక్ జాఫర్ టీడీపీని వీడి ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను సమక్షంలో వైఎస్సార్ సీపీలోకి చేరారు. ఈ సందర్భంగా ఉదయభాను ఆయనకు పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

ప్రజల ముంగిటకే ప్రభుత్వ సేవలు

ప్రభుత్వ విప్ సామినేని ఉదయభాను

నందిగామ: ప్రభుత్వ సేవలు ప్రజల ముంగిటకు రావాలన్నదే ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి లక్ష్యమని ప్రభుత్వ విప్, జగ్గయ్యపేట ఎమ్మెల్యే సామినేని ఉదయభాను అన్నారు. నందిగామ మండలం జగ్గయ్యపేట నియోజకవర్గ పరిధిలోని దాములూరు గ్రామంలో మంగళవారం జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా గ్రామస్తులకు మంజూరైన పలు సర్టిఫికెట్లను అందజేశారు. అనంతరం తడి, పొడి చెత్తకు సంబంధించిన బిన్ లను గ్రామస్తులకు అందజేశారు. కార్యక్రమంలో కేడీసీసీ బ్యాంక్ డైరెక్టర్ కొమ్మినేని రవి శంకర్, గ్రామ సర్పంచ్ గాదెల రామారావు, పలు గ్రామాల ప్రజాప్రతినిధులు, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

దగ్ధమైన ద్విచక్ర వాహనం



పెద్దాపురం(వీరులపాడు): ద్విచక్ర వాహనానికి ప్రమాదవశాత్తు మంటలు వ్యాపించిన ఘటన మండలంలో జరిగింది. సేకరించిన సమాచారం ప్రకారం పెద్దాపురం గ్రామానికి చెందిన పసుపులేటి వీరరాఘవయ్య రోజూ మాదిరిగానే మంగళవారం సాయంత్రం తన ద్విచక్ర వాహనంపై పొలం పనులకు వెళ్లి వస్తుండగా ఒక్కసారిగా బైక్‌లో నుంచి మంటలు వచ్చాయి. గమనించిన వీరరాఘవయ్య వెంటనే బైక్ పైనుంచి కిందకు దూకేశారు. ద్విచక్ర వాహనం పూర్తిగా దగ్ధమైంది.

పారిశుద్ధ్య కార్మికుడి కుటుంబాన్ని ఆదుకోవాలి

కంచికచర్ల: విధి నిర్వహణలో మృతి చెందిన పారిశుద్ధ్య కార్మికుడి కుటుంబాన్ని ఆదుకోవాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు బెజ్జం భూషణం అన్నారు. ఇటీవల విజయనగరం జిల్లాలో విధుల్లో ఉన్న పారిశుద్ధ్య కార్మికుడు మృతి చెందాడని, ఆ కుటుంబానికి ఎక్స్‌గ్రేషియా ఇచ్చి ఆదుకోవాలని కోరుతూ స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద మంగళవారం నిరసన ప్రదర్శన చేశారు. అనంతరం ఎంపీడీఓ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు.

మతిస్థిమితం లేని యువకులను వైద్యశాలకు తరలింపు



నందిగామ: మానసిక పరిస్థితి సరిగా లేని ఇద్దరు యువకులను నందిగామ పోలీసులు ప్రత్యేక చొరవతో మంగళవారం వైద్య సేవలకు తరలించారు. పట్టణ సీఐ హనీష్ తెలిపిన సమాచారం ప్రకారం పట్టణ శివారు డీవీఆర్ కాలనీకి చెందిన నాగెళ్ల కృష్ణ, నాగెళ్ల వినోద్ అన్నదమ్ములు. వీరికి చిన్నతనం నుంచి మానసిక పరిస్థితి సరిగ్గా ఉండదు. ఈ నేపథ్యంలో వారికి తెలియకుండానే ప్రజలను ఇబ్బందులు పెడుతూ ఉంటారు. దీనిని గమనించిన నందిగామ పోలీసులు వారిద్దరిని ప్రత్యేకంగా న్యాయమూర్తి అనుమతితో విశాఖపట్టణం లోని ప్రభుత్వ మానసిక వైద్యశాలకు తరలించారు.

ప్రజల వద్దకే సేవలు

పెనుగంచిప్రోలు: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా ప్రజల వద్దకే 11 రకాల సేవలు అందుతాయని మండల ప్రత్యేకాధికారి సత్యనారాయణ అన్నారు. పెనుగంచిప్రోలు-3 సచివాలయంలో మంగళవారం సర్పంచ్ వేల్పుల పద్మకుమారి, గుమ్మడిదూర్రులో సర్పంచ్ నక్కా కమల అధ్యక్షతన జగనన్న సురక్ష క్యాంప్‌లు నిర్వహించారు. ఈ సందర్భంగా లబ్ధిదారులకు వివిధ రకాల ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అర్హత కలిగిన ప్రతి ఒక్కరినీ వలంటీర్లు ఇంటింటికీ తిరిగి గుర్తించి సంక్షేమ పథకాలు అందజేస్తున్నారన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అభివృద్ధికి, సంక్షేమానికి పెద్దపీట వేస్తున్నారన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ కె.లక్ష్మీకల్యాణి, ఎంపీడీఓ ఎస్‌వీ ప్రసాద్, ఏఓ సిద్ధారెడ్డి, డీటీ భాస్కరరావు, ఈఓపీఆర్‌డీ శ్యామ్, మండల సమాఖ్య అధ్యక్షురాలు కాకాని పద్మ, సీనియర్ అసిస్టెంట్ జనార్ధనరావు, నాయకులు వేల్పుల రవికుమార్, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వాసుపత్రులకు మహర్దశ

వైద్య శాఖ మంత్రి విడదల రజిని



వైఎస్సార్ పట్టణ ఆరోగ్య కేంద్ర ప్రారంభ సభలో మాట్లాడుతున్న మంత్రి రజని, వేదికపై విప్ ఉదయభాను, కలెక్టర్ ఢిల్లీరావు తదితరులు

జగ్గయ్యపేట అర్బన్: రాష్ట్రంలో జగనన్న పాలనలో ప్రభుత్వాసుపత్రులకు మహర్దశ నెలకొందని రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని అన్నారు. పట్టణంలో 30 పడకల నుంచి 50 పడకల ఆసుపత్రిగా స్థాయి పెంచి రూ.3 కోట్లతో నిర్మించిన నూతన భవనం, రూ.90 లక్షలతో తొర్రగుంటపాలెంలో, మరో రూ.90 లక్షలతో బలుసుపాడు రోడ్డులో నిర్మించిన అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను మంగళవారం ఆమె స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వవిప్ సామినేని ఉదయభానుతో కలిసి ప్రారంభించారు. ముందుగా పట్టణ పార్టీ కార్యాలయం నుంచి ర్యాలీగా తరలివెళ్లి హెల్త్ సెంటర్లను ప్రారంభించారు. అనంతరం ప్రభుత్వాసుపత్రి వద్ద ఏర్పాటు చేసిన సభలో ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో నాడు-నేడు పథకంలో భాగంగా ప్రభుత్వాసుపత్రుల రూపురేఖలు మారుతున్నాయన్నారు. విప్ ఉదయభాను మాట్లాడుతూ పట్టణంలో 60 వేల మంది జనాభాకు అనుగుణంగా పట్టణంలోని ప్రభుత్వాసుపత్రిలో 30 పడకల నుంచి 50 పడకలకు పెంచటంతో పాటు పట్టణానికి రెండు వైపులా వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్లను ఏర్పాటు చేశామన్నారు. పేట ప్రభుత్వాస్పత్రిని కార్పొరేట్‌కు దీటుగా అభివృద్ధి చేశామన్నారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో పేట ప్రభుత్వాసుపత్రిలో కేవలం ముగ్గురు వైద్యులు మాత్రమే ఉండేవారని, నేడు అన్ని విభాగాలకు వైద్యులు ఉన్నారన్నారు. రూ.కోటితో డయాలసిస్ విభాగం కూడా నెలకొల్పామన్నారు. ఆసుపత్రికి అదనంగా రెండు వైద్యుల పోస్టులతో పాటు, ప్రమాదాల సమయంలో అత్యవసర చికిత్సలకు అవసరమైన సామగ్రి అందించాలని



పట్టణంలో ర్యాలీ చేస్తున్న వైఎస్సార్ సీపీ కార్యకర్తలు

మంత్రిని కోరగా ఆమె సానుకూలంగా స్పందించారు. పట్టణంలోని బలుసుపాడు రోడ్డులో 500 గృహాలతో జగనన్న కాలనీ నిర్మించామన్నారు. టీడీపీ పాలనలో 3 వేల టిడ్కో గృహాల నిర్మాణం అసంపూర్తిగా వదిలేయగా, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక కాంట్రాక్టర్‌కు బకాయిలు చెల్లించి వాటిని పూర్తి చేయిస్తున్నామని, రానున్న నాలుగైదు మాసాల్లో ప్రారంభిస్తామన్నారు. జాతీయ రహదారిపై రూ.కోటితో బస్టాండ్ నిర్మాణ పనులు త్వరలో ప్రారంభమవుతాయన్నారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు, కేడీసీసీ బ్యాంక్ చైర్మన్ తన్నీరు నాగేశ్వరరావు, మున్సిపల్ చైర్మన్ రాఘవేంద్ర, వైఎస్సార్‌సీపీ యువ నాయకులు సామినేని వెంకటకృష్ణ ప్రసాద్, డీఎంహెచ్ఓ సుహాసిని, వైద్య విధాన పరిషత్ జాయింట్ కమిషనర్ సరళమ్మ, మున్సిపల్ వైస్‌చైర్మన్‌లు తుమ్మల ప్రభాకర్, హఫీజున్నీసా, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు ఆకుల శ్రీకాంత్, పెనుగంచిప్రోలు, వత్సవాయి జెడ్పీటీసీ సభ్యులు దేవమణి, వూట్ల నాగమణి, ఎంపీపీ మార్కపూడి గాంధీ, మైనింగ్, పూసల కార్పొరేషన్ డైరెక్టర్లు బత్తుల రామారావు, చేని కుమారి, ఏఎంసీ చైర్మన్ ముత్తినేని విజయశేఖర్, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు కఠారి హరిబాబు, నాగమణి, అక్బర్‌ఖాన్, వైఎస్సార్ సీపీ నాయకులు వేల్పుల రవికుమార్, నంబూరి రవి, ఫిరోజ్‌ఖాన్, తదితరులు పాల్గొన్నారు.

వలంటీర్లకు పవన్‌కళ్యాణ్ బహిరంగంగా క్షమాపణ చెప్పాలి

పెండ్యాల(కంచికచర్ల): గ్రామాల్లో ప్రజలకు స్వచ్ఛందంగా సేవలందించే వలంటీర్లను జనసేన అధ్యక్షుడు పవన్‌కళ్యాణ్ సంఘ విద్రోహ శక్తులతో పోల్చటం సరైన విధానం కాదని ఎంపీపీ షేక్ మలక్‌బషీర్ అన్నారు. కంచికచర్ల మండలం పెండ్యాల గ్రామంలో వలంటీర్లు మంగళవారం పవన్‌కళ్యాణ్ ఫ్లెక్సీని చెప్పులతో కొడుతూ గ్రామ పురవీధుల్లో నిరసన ప్రదర్శన చేశారు. వలంటీర్లకు మద్దతుగా ఎంపీపీ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వలంటీర్లను విద్రోహశక్తులతో పోల్చటం మంచి పద్ధతి కాదన్నారు. కోవిడ్ మహమ్మారి సమయంలో సొంత కుటుంబసభ్యులు, బంధువులు వెళ్లని ఇళ్లకు సైతం వెళ్లి మరీ వారికి సేవలందించారని గుర్తుచేశారు. వలంటీర్లపై అనుచిత వ్యాఖ్యలు చేసిన పవన్‌కళ్యాణ్ తన వ్యాఖ్యలను బేషరతుగా ఉపసంహరించుకోవాలని, బహిరంగంగా వారికి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పెండ్యాల, వేములపల్లి గ్రామాలకు చెందిన వలంటీర్లు పాల్గొన్నారు.



పెండ్యాలలో పవన్‌కళ్యాణ్ ఫ్లెక్సీని చెప్పలతో కొడుతూ గ్రామంలో నిరసన ప్రదర్శన చేస్తున్న వలంటీర్లు

పవన్ కళ్యాణ్ దిష్టిబొమ్మ దహనం

బలుసుపాడు(జగ్గయ్యపేట): జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ వలంటీర్లపై చేసిన వ్యాఖ్యలకు నిరసనగా గ్రామంలోని వలంటీర్లు మంగళవారం రాత్రి పవన్ కళ్యాణ్ దిష్టిబొమ్మను దహనం చేశారు.

పాఠశాలకు ఫర్నిచర్ అందజేత

తిరుమలగిరి(జగ్గయ్యపేట): గ్రామంలోని మండల పరిషత్ పాఠశాలకు జగ్గయ్యపేట వాసవి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ఓరుగంటి వెంకటేశ్వరరావు కుర్చీ, టేబుల్‌ను మంగళవారం ప్రధానోపాధ్యాయుడు వెంకటేశ్వర్లుకు వితరణగా అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జయంతిపురంలో జగనన్న సురక్ష

జయంతిపురం(జగ్గయ్యపేట): జగనన్న సురక్షలో 11 రకాల ప్రభుత్వ సేవలను ఉచితంగా అందిస్తారని డిప్యూటీ తహసీల్దార్ నాగరాజు తెలిపారు. స్థానిక గ్రామ సచివాలయంలో మంగళవారం జగనన్న సురక్ష క్యాంపు నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురికి సర్టిఫికెట్‌లు అందజేశారు. కార్యక్రమంలో కార్యదర్శి రామారావు, సర్పంచ్ నరసింహారావు, వలంటీర్‌లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఉత్సాహంగా జగనన్న సురక్ష శిబిరాలు



పరిటాలలో లబ్ధిదారులకు సర్టిఫికెట్ అందజేస్తున్న ఎమ్మెల్సీ అరుణ్‌కుమార్, ఎంపీపీ, జెడ్పీటీసీ

పరిటాల/గొట్టుముక్కల(కంచికచర్ల): మీ ఇంటి తలుపు తట్టి సమస్యలు అడిగి తెలుసుకుని ఎటువంటి సర్వీస్ ఫీజు లేకుండా సర్టిఫికెట్లను జారీ చేస్తున్న ఏకైక ప్రభుత్వం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వమని ఎమ్మెల్సీ డాక్టర్ మొండితోక అరుణ్‌కుమార్ అన్నారు. మండలంలోని పరిటాల, గొట్టుముక్కల గ్రామాల్లో మంగళవారం జగనన్న సురక్ష గ్రామసభలు జరిగాయి. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎమ్మెల్సీ మాట్లాడుతూ ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలు అందుకునే విషయంలో ఎవరూ మిగిలిపోకూడదనే ఉద్దేశంతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కార్యక్రమానికి శ్రీకారం చుట్టారన్నారు. ప్రతి ఇంటికి ప్రభుత్వ పథకాలు అందాలన్నదే సీఎం ఆకాంక్ష అన్నారు. సామాన్యుడి గడప వద్దకు ప్రభుత్వ సేవలు వెళ్లాలనే ఉద్దేశంతోనే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వలంటీర్ల వ్యవస్థను నెలకొల్పారని అన్నారు. వలంటీర్ల వ్యవస్థతో ప్రజలకు మేలు చేకూరుతోందన్నారు. గతంలో జన్మభూమి కమిటీల వద్దకు వెళ్లి చేతులు కట్టుకుని పథకాలు మంజూరు చేయాలని అడిగితే, టీడీపీ నాయకులు చెప్పిన వారికే పథకాలు వచ్చేవని ఆరోపించారు. ప్రజలకు మంచి చేసే ప్రభుత్వం వైఎస్సార్ సీపీ ప్రభుత్వమని అన్నారు. అనంతరం పరిటాలలో 776 మంది లబ్ధిదారులకు వివిధ రకాల సర్టిఫికెట్లు అందజేశారు. గొట్టుముక్కల గ్రామంలో 959 మంది లబ్ధిదారులకు సర్టిఫికెట్లు పంపిణీచేశారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి పి.ఉమాదేవి, ఎంపీపీ షేక్ మలక్‌బషీర్, పరిటాల, గొట్టుముక్కల గ్రామ సర్పంచ్‌లు యద్దనపూడి ఆనందజ్యోత్స్న, తుల్లిమల్లి రాజకుమార్, జెడ్పీటీసీ సభ్యులు వేల్పుల ప్రశాంతి, ఏఎంసీ మాజీ చైర్మన్ మార్త రజిని, గ్రామ సచివాలయాల మండల కన్వీనర్ చింతా రవీంద్రనాథ్, ఎంపీడీఓ కె.బాలశంకరరావు, తహసీల్దార్ శంకరబాబు, ఎంపీటీసీ సభ్యులు, వైఎస్సార్ సీపీ నాయకులు, వలంటీర్లు, గృహసారథులు, గ్రామ సచివాలయ సిబ్బంది, పలుశాఖల అధికారులు పాల్గొన్నారు.

పేదలకు మంచి చేయటమే సీఎం జగన్ లక్ష్యం

గడపగడపలో ఎమ్మెల్యే జగన్‌మోహనరావు



కొణతాలపల్లి గ్రామంలో సంక్షేమ పథకాల గురించి వివరిస్తున్న ఎమ్మెల్యే జగన్‌మోహనరావు

కొణతాలపల్లి(వీరులపాడు): నిరుపేదలకు మంచి చేయటమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పని చేస్తున్నారని శాసనసభ్యుడు డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు అన్నారు. మండలంలోని కొణతాలపల్లి గ్రామంలో మంగళవారం ఆయన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. దీనిలో భాగంగా గ్రామంలోని ప్రతి గడపకు వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలు వివరించి ప్రజా సంక్షేమ పథకాలు అమలు తేదీలతో కూడిన క్యాలెండర్‌ను ప్రజలకు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత ప్రభుత్వాల హయాంలో కార్పొరేట్ శక్తులు, ఆయా పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలకు మినహా పేద ప్రజలకు చేసిందేమీ లేదన్నారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో జన్మభూమి కమిటీల పుణ్యమా అని అర్హత ఉండి కూడా ఎంతో మంది సంక్షేమ పథకాలు పొందలేకపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో పార్టీలు, కుల, మతాలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు అందిస్తున్నారని చెప్పారు. ఏవైనా చిన్నచిన్న కారణాల వల్ల అర్హత ఉండి కూడా పథకాలు అందని వారుంటే గుర్తించి పథకాలు అందించాలనే మహోన్నత లక్ష్యంతో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహిస్తున్నారని తెలిపారు.

పట్టణాలకు దీటుగా గ్రామాల అభివృద్ధి

ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, విలేజ్ హెల్త్ క్లినిక్‌లతో పాటు గ్రామంలో ప్రజలకు అవసరమైన ప్రతి ఒక్క సౌకర్యాన్ని కల్పించి పట్టణాలకు దీటుగా గ్రామాలను అభివృద్ధి చేస్తున్నట్లు ఎమ్మెల్యే జగన్మోహనరావు తెలిపారు. మంచి చేస్తున్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి అండగా నిలిచి అఖండ విజయాన్ని అందించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ కోటేరు లక్ష్మి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ ఆవుల రమేష్‌బాబు, జెడ్పీటీసీ సభ్యురాలు అమర్లపూడి కీర్తి సౌజన్య, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు కోటేరు ముత్తారెడ్డి, షేక్ కార్పొరేషన్ డైరెక్టర్ షహనాజ్ బేగం, సర్పంచ్ నంద్రు సౌజన్య, ఎంపీటీసీ సభ్యురాలు అయిలూరి వెంకట్రావమ్మ, ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ నువ్వుల విశ్వనాథం, ఉప సర్పంచ్ అయిలూరి నర్సిరెడ్డి, నరాల రాజేశ్వర్ రెడ్డి, గాంధీ, వలంటీర్‌లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

దేశానికి ఆదర్శంగా వలంటీర్ వ్యవస్థ

ప్రాణాలు పణంగా పెట్టి సేవలందిస్తున్న వలంటీర్‌లు



ముఖ్యమంత్రి చేతుల మీదుగా సేవా రత్న అందుకుంటున్న వలంటీర్ నాగేశ్వరరావు(ఫైల్)

వీరులపాడు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన వలంటీర్ వ్యవస్థ దేశానికే ఆదర్శంగా నిలుస్తుందనటంలో అతిశయోక్తి లేదు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వలంటీర్ వ్యవస్థ ద్వారా అర్హులైన ప్రతి ఒక్కరికీ కులమతాలకు అతీతంగానే సంక్షేమ పథకాలు అందిస్తున్నారు. ప్రతిపక్ష పార్టీలు చేసిందేమీ లేకపోయినా మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు, జనసేన అధ్యక్షుడు పవన్‌కళ్యాణ్ వలంటీర్ వ్యవస్థను అవహేళన చేయటంతో పాటు అవమానకరంగా మాట్లాడటం బాధాకరమని పలువురు వలంటీర్‌లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కరోనా సమయంలో ప్రాణాలను పణంగా పెట్టి సేవలందించిన తమపై అనుచితంగా మాట్లాడటం తగదని సూచిస్తున్నారు.

వలంటీర్ల సేవలు వెలకట్టలేనివి

నందిగామ: ప్రజల ఇంటి ముంగిటకు ప్రభుత్వ సేవలను తీసుకురావాలన్న సత్సంకల్పంతో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం దేశంలోనే ఎక్కడా లేని విధంగా వలంటీర్ల వ్యవస్థను ప్రవేశపెట్టింది. ప్రభుత్వ ఆశయానికనుగుణంగా వలంటీర్లు కూడా సేవాభావంతో ప్రతినిత్యం స్థానికులకు అందుబాటులో ఉంటూ వారి యోగ క్షేమాలను చూసుకుంటూ అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు అందేలా చూస్తున్నారు. ప్రజలు వారిని తమకు ఆపద్బాంధవుల్లా భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో ప్రజలు వలంటీర్ల సేవలను వేనోళ్ల కొనియాడు తున్నారు.

పుట్టిన గ్రామానికే సేవ చేయటం ఆనందంగా ఉంది



నేను పుట్టిన గ్రామంలోని ప్రజలకే వలంటీర్‌గా సేవ చేయటం సంతోషంగా ఉంది. వలంటీర్ వ్యవస్థను మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు, జనసేన అధ్యక్షుడు పవన్‌కళ్యాణ్ అవహేళనగా మాట్లాడటం మంచి పద్ధతి కాదు. కరోనా సమయంలో సైతం మా ప్రాణాలను పణంగా పెట్టి సేవలందించాం. కరోనా సెకండ్ వేవ్‌లో ఫిబ్రవరి రెండున, 2021లో గ్రామానికి చెందిన ఆర్ఎంపీ వైద్యుడు మహబూబ్ షరీఫ్ హైదరాబాద్‌లోని మెడిసిటీ ఆస్పత్రిలో బైపాస్ సర్జరీ చేయించుకున్నారు. విషయం తెలుసుకుని హైదరాబాద్ వెళ్లి మూడు నెలల పింఛన్ రూ.7,500 అందించాను. ఆ సమయంలో ఆయన కుటుంబ సభ్యులు చూపించిన ఆదరాభిమానాలు ఎప్పటికీ మరువలేను. ఇటువంటి సేవ చేసే అవకాశం కల్పించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి రుణపడి ఉంటాను.

– శీలం లక్ష్మి, వలంటీర్, జయంతి గ్రామం


నా అదృష్టంగా భావిస్తున్నా



నేను వలంటీర్ గా పనిచేయటం అదృష్టంగా భావిస్తున్నా. నా పరిధిలో 81 ఇళ్లు ఉన్నాయి. వాటిలో 27 మంది పింఛన్ లబ్ధిదారులు ఉన్నారు. నా సేవలను గుర్తించి ప్రభుత్వం 2002లో సేవావజ్ర అవార్డు ఇచ్చింది. 2023లో సేవా రత్న అవార్డును స్వయంగా రాష్ట్ర ముఖ్యమంత్రి చేతుల మీదుగా అందుకున్నా. ఇది నాకు చాలా గర్వంగా ఉంది. ఇదే ఉత్సాహంతో మరింత సేవలందిస్తున్నాను.

– నిమ్మల నాగేశ్వరరావు, వలంటీర్, అనాసాగరం

ఇంటి ముంగిటే అన్ని సేవలు అందుతున్నాయి



మా వలంటీర్ ప్రతినెలా ఒకటో తేదీ నాడు వేకువజామునే పింఛన్ అందజేయడంతో పాటు సచివాలయాల ద్వారా అందే సేవలన్నీ ఆయనే చేసి పెడుతున్నాడు. దీంతో ఏ పనికైనా అసలు మేము సచివాలయానికి వెళ్లే అవసరం కూడా రావడం లేదు. నిజంగా వలంటీర్ల సేవలు వెలకట్టలేనివి.

– కర్రి వెంకటేశ్వర్లు, అనాసాగరం

నేడు సత్యమ్మ అమ్మవారి హుండీ కానుకల లెక్కింపు

నందిగామ: మండలంలోని అంబారుపేట గ్రామంలో గల సత్యమ్మ అమ్మవారి ఆలయంలో హుండీల లెక్కింపు కార్యక్రమం బుధవారం నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో సీతారామయ్య మంగళవారం రాత్రి ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు హుండీల లెక్కింపు కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. కార్యక్రమంలో ఆసక్తి గల భక్తులు పాల్గొనవచ్చని తెలిపారు.

గాయపడి చికిత్స పొందుతున్న వృద్ధుడు మృతి

నందిగామ: రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ ఓ వృద్ధుడు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మృతి చెందాడు. ఎస్ఐ సోమేశ్వరరావు తెలిపిన సమాచారం ప్రకారం అంబారుపేట గ్రామానికి చెందిన బెల్లంకొండ గోపాలం (65) నందిగామ పట్టణ సమీపంలో 65 వ నంబర్ జాతీయ రహదారి పక్కనే ఉన్న ఓ సర్వీస్ పాయింట్‌లో వాచ్‌మెన్‌గా పనిచేస్తాడు. ఈ నేపథ్యంలో ఈ నెల 8 వ తేదీ రాత్రి రోడ్డు వెంట నడుస్తూ వస్తున్న గోపాలంను లారీ ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ గోపాలం ఆసుపత్రిలో చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మృతి చెందాడు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ప్రవల్లిక మృతదేహానికి రీపోస్టుమార్టమ్

పోలంపల్లి(వత్సవాయి): గత నెలలో అనుమానాస్పద స్థితిలో బావిలో పడి మృతిచెందిన తుంగ ప్రవల్లిక మృతదేహానికి మంగళవారం రీపోస్టుమార్టమ్ నిర్వహించారు. అయితే ప్రవల్లిక మృతిపై పలు అనుమానాలను వ్యక్తం చేస్తూ ఎమ్మార్పీఎస్ రీపోస్టుమార్టమ్‌కు డిమాండ్ చేశారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు రీపోస్టుమార్టమ్‌ను విజయవాడకు సిద్ధార్థ మెడికల్ కళాశాలకు చెందిన ఫోరెన్సిక్ విభాగం వారు తహసీల్దార్ వైకుంఠరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. పోస్టుమార్టమ్ నివేదికను జిల్లా ఉన్నతాధికారులకు అందజేస్తామని తెలిపారు. ఈ సందర్భంగా పోలీసులు గ్రామంలో ఎటువంటి అల్లర్లు జరగకుండా బందోబస్తు నిర్వహించారు.

మంచి చేయాలనే సంకల్పానికి నిదర్శనం



నందిగామ జగనన్న సురక్ష క్యాంపులో సర్టిఫికెట్‌లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్సీ అరుణకుమార్

వీరులపాడు: జగనన్న సురక్ష క్యాంపులు నిరుపేదలకు మంచి చేయాలనే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంకల్పానికి నిదర్శనమని శాసనసభ్యుడు డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు అన్నారు. మండలంలోని కొణతాలపల్లి, అల్లూరు గ్రామాలలో మంగళవారం నిర్వహించిన జగనన్న సురక్ష క్యాంపులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ క్యాంపుల్లో ఎంతో కాలంగా పరిష్కారానికి నోచుకోని సమస్యలు పరిష్కారమవటంతో పాటు రావనుకుంటున్న సర్టిఫికెట్‌లు కూడా గంటల వ్యవధిలో అందజేస్తుండటంతో ప్రజల ముఖాలలో చిరునవ్వులు కనిపిస్తున్నాయన్నారు. అనంతరం పలువురు లబ్ధిదారులకు ఆయన సర్టిఫికెట్‌లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ కోటేరు లక్ష్మి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల కన్వీనర్ ఆవుల రమేష్‌బాబు, జెడ్పీటీసీ సభ్యురాలు అమర్లపూడి కీర్తి సౌజన్య, షేక్ కార్పొరేషన్ డైరెక్టర్ షహనాజ్ బేగం, సర్పంచ్ నంద్రు సౌజన్య, ఎంపీటీసీ సభ్యురాలు అయిలూరి వెంకట్రావమ్మ, అధికారులు పాల్గొన్నారు.

దమ్మున్న నాయకుడు జగన్‌మోహన్‌రెడ్డి

నందిగామటౌన్: మంచి చేశామని నమ్మితేనే మాకు అండగా ఉండాలని చెబుతున్న దమ్మున్న నాయకుడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని శాసనమండలి సభ్యుడు డాక్టర్ మొండితోక అరుణకుమార్ అన్నారు. పట్టణంలోని ఏడు, ఎనిమిది వార్డుల పరిధిలోని సచివాలయం-4లో నిర్వహించిన జగనన్న సురక్ష క్యాంపును మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పట్టణాన్ని అన్ని రకాలుగా అభివృద్ధి చేసిన ఘనత వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకే దక్కుతుందన్నారు. తాము అభివృద్ధి చేస్తుంటే ఓర్వలేక న్యాయస్థానాలను ఆశ్రయించి అభివృద్ధిని అడ్డుకుంటున్న ఘనత టీడీపీకే దక్కిందని ఎద్దేవా చేశారు. అనంతరం పలువురు లబ్ధిదారులకు ఆయన సర్టిఫికెట్‌లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ మహ్మద్ మస్తాన్, వాణిజ్య విభాగం రాష్ట్ర కార్యదర్శి చల్లా బ్రహ్మేశ్వరరావు, మున్సిపల్ కమిషనర్ జయరాం తదితరులు పాల్గొన్నారు.

రామడుగుకు దక్కిన గౌరవం



పెనుగంచిప్రోలు(జగ్గయ్యపేట): పెనుగంచిప్రోలుకు చెందిన ప్రముఖ పండితుడు,ఆధ్యాత్మిక వేత్త, శతావధాని రామడుగు నరసింహాచార్యులుకు ఇటీవల జరిగిన అమెరికాలో జరిగిన నాటా సభల్లో సముచిత గౌరవం లభించింది. పండితుడిగా, కవిగా, ఆలయాల ప్రతిష్టాచారిగా, శతావధానిగా, పలు బిరుదులు సొంతం చేసుకున్న ఆయన ఉత్తర అమెరికా తెలుగు సమితి(నాటా) పిలుపు మేరకు అమెరికా వెళ్లి జానపదంలో భక్తిరసం అంశం మీద ప్రసంగించారు. ఈ సందర్భంగా అమెరికా తెలుగు సమితి వారు ఆయన్ను సన్మానించారు.

చికిత్స పొందుతూ వృద్ధుడి మృతి

కంచికచర్ల: మోతాదుకు మించి మాత్రలు మింగటంతో ఓ వృద్ధుడు అస్వస్థతకు గురై ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన పట్టణంలో మంగళవారం జరిగింది. ఎస్ఐ సుబ్రహ్మణ్యం కథనం మేరకు కంచికచర్లకు చెందిన కుర్రా నరసింహారావు(63)కు గతంలో బ్రెయిన్ స్ట్రోక్ వచ్చింది. ఈనెల 8వ తేదీన వ్యాధికి సంబంధించిన మాత్రలు ఎక్కువ మోతాదులో తీసుకోవటంతో అస్వస్థతకు గురయ్యారు. గమనించిన కుటుంబ సభ్యులు వైద్య చికిత్స కోసం గుంటూరులోని ప్రయివేటు ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడ వైద్య చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బాలికపై లైంగికదాడి

చిల్లకల్లు(జగ్గయ్యపేట): బాలికపై ఓ వ్యక్తి లైంగిక దాడికి పాల్పడిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాల్లోకి వెళ్తే.. మండలంలోని షేర్ మహ్మద్‌పేట క్రాస్ రోడ్డు వద్దనున్న మంగొల్లు వెళ్లే రహదారి పక్కన గుడారాలు వేసుకుని కొంత మంది జీవనం సాగిస్తున్నారు. ఈ నెల ఒకటిన 11 ఏళ్ల బాలికపై అదే ప్రాంతానికి చెందిన 17 ఏళ్ల బాలుడు నిర్మానుష్య ప్రాంతానికి తీసుకెళ్లి లైంగిక దాడికి పాల్పడ్డాడు. రెండు రోజుల తర్వాత బాలిక అస్వస్థతకు గురవటంతో బాలిక జరిగిన విషయం ఇంట్లో చెప్పింది. దీంతో బాలిక తల్లి చిల్లకల్లు పోలీసులకు ఆదివారం రాత్రి ఫిర్యాదు చేసింది. బాలిక తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్.ఐ కృష్ణబాబు తెలిపారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
నందిగామ డివిజన్
79950 92114 (నందిగామ)
99122 20547 (జగ్గయ్యపేట)
Office mail : sakshiads@gmail.com